# 30

# కేశోపనిషత్తు

మన సాహిత్యంలో, సర్వాంగ వర్ణనలున్న సంగతి మనకు తెలిసిందే! ఒక్కో అంగం వరంగా, ఒక్కో పేరుతో ఆడవాళ్ళను వర్ణించడమూ మనకు తెలిసిందే. ఈ సర్వాంగ వర్ణనల్లో అరికాలు మొదలుకొని, నడిశిరస్సు దాకా ఉన్న దేన్నీ మన కవులు విడిచిపుచ్చారు గాదు. అయినప్పుడు, శిరస్సునూ, వెంట్రుకలనూ వదులుతారా? ఆ వ్యక్తి పార్వతి గానీండి, లక్ష్మీదేవి గానీండి, సరస్వతిగానీండి జుట్టును గురించి, అధమపక్షం అరడజను పద్యాలైనా రాయందే, తెలుగు కవికి కుతి తీరదు. అప్పుడప్పుడు మగవారి జుట్టును గురించి కూడా రాశారు గానీ - ఆ మగవారు - మరీ గొప్పవారో, అవతార పురుషులో అయితే తప్ప జుట్టు దాకా పోయేవారు కాదు. జుట్టుకు, సాహిత్యంలోనే కాదు- నిత్య జీవితంలో కూడా మంచి స్థానమే ఉంది. బట్టతల వారివేపు వింతగా చూసినట్లే వంకుల జుట్టున్నవారికేసి ఆసక్తిగా చూస్తాం. జుట్టు పెరగడానికి, నిగనిగలాడడానికి నల్లగా వొంకులు తిరగడానికి తోడుపడే తలనూనెల ప్రకటనలు, మనం రోజూ పత్రికల్లో ఎన్ని చూస్తున్నాం గాదు?

సరిపోయినంత జుట్టులేనివారు, ఆ లోపాన్ని కప్పి పుచ్చుకోవడానికి సవరాలు వాడడం - చాలా కాలంగా వాడకంలో ఉన్నదే!

అసలు 'సవరము' అంటే 'చమరీమృగం తోక' అని కొందరూ, 'చమరీమృగం ఒంటిమీది వెంట్రుకలు' అని మరికొందరు నిఘంటుకారులు రాశారు. మరి కవి ప్రయోగాలు బోలెడున్నాయి.

"సవరాలు దొడిగెను సవరణతోడ " అనీ -

"సవరాల జమని కెసరగ బన్నించి" అనీ -

ఇంకా ఇంకానూ ఉన్నాయి.

కృత్రిమ కేశాలద్వారా ఉన్న లోపాలను సవరించుకోవచ్చునని తెలిసినప్పటి నుండి, సవరాలకూ వాటిని కట్టేవారికి మాంచి గిరాకీ ఉన్నదని చెప్పుకోవచ్చు. ఒకప్పుడు ఎవరంతట వారే ఈ సవరాలను తయారు చేసుకొనేవారేమోగానీ, రాను రానూ ఈ పని చేసేవారంతా ఒక ప్రత్యేక శాఖగా విడిపోయారు. మన పూసల రాములు ఈ శాఖకు చెందిన వాడే!

అసలు అతనింటిపేరు 'పూసల' కాదుట. కానీ తాత ముత్తాతల కాలం నుండి రంగు పూసలు, కర్పూరపు దండలు, సవరాలు, అద్దాలు, రకరకాల కుంకుమలు, పసుపులు, పట్టుదారాలు, సబ్బులు, కాటుకలు, దాసెనలు, దువ్వెనలు, మొలతాళ్ళు, లక్కపిడతలు, గవ్వలు, పునుగుపూసలు, సూదులు, పిన్నీసులు వగైరా వగైరాలు అమ్ముతూ ఉండడం వల్ల 'పూసల' అన్నది ఇంటి పేరయి పోయిందట.

ఇప్పుడు మన రాములు, ఆ సరుకుల్ని తీసుకొని ఇల్లిల్లూ తిరగడం లేదు. "తిరిగినా లాభంలేదండి బాబయ్యా! బజారుకో పాతిక ఫాన్సీషాపులొచ్చాక మా యాపారం పూర్తిగా పడిపోయిందండి! ఇంక మాకు మిగిలందల్లా ఇదొక్కటే" అన్నాడు రాములు, తనముందు కుప్పగా ఉన్న వెంట్రుకలను చూపిస్తూ.

దీని వల్ల కూడా అతనేవో నాలుగు రాళ్ళు వెనకేసుకుంటున్నాడనుకోవడానికీ వీలు లేదు. ఊరికి దూరంగా మురికి గూడెంలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న గుడిసె. ప్రక్కనే తల తిరిగిపోయేంత

దుర్వాసనలు చిమ్ముతున్న మురుక్కాలవ, నడవడానిక్కూడా వీలులేనంతటి సన్నని ఇరుకు సందులమధ్య రాములు బతుకుతున్నాడు.

వారానికో పదిరోజులకోసారి, బజారుకెళ్ళి కావలసిన వెంట్రుకల్ని కొని తెచ్చుకుంటాడు. వాటినన్నింటినీ, మళ్ళా చిక్కుదీస్తాడు. తెల్లవెంట్రుకలూ, పొట్టి వెంట్రుకలూ లేకుండా చూస్తాడు. తరువాత, వాటి మొదళ్ళు పట్టుదారంతో బిగగట్టి కుంకుడు నీళ్ళతో కడుగుతాడు. ఆరబెడతాడు. జుట్టు ఫెళ ఫెళలాడేలాగా నిగనిగలాడేలాగా చేస్తాడు. ఆ తరువాత, సన్నని ఇనప తీగతో బిగించి, దానిమీద పట్టుదారం చుట్టి, సవరం నెత్తిమీద నల్లలక్కతో టోపీలాగా అమర్చుతాడు. ఇప్పటికి సవరం పూర్తయినట్టు. ఇదొక రకం!

మరో రకం సవరం - పాయలు పాయలుగా ఉంటుంది. కాసిని కాసిని వెంట్రుకలు తీసుకొని సుతారంగా కొంత మేరకు జడనల్లి- అది మళ్ళా విడిపోకుండా, ముడివేస్తాడు. ఒక్కోపాయలో 3, 4, 5 జడలుదాకా ఉండొచ్చు. దీన్నొక 'కుచ్చు' అంటారు. ఇలాంటి కుచ్చులు 5, 6 కలిపి వో సవరం చేస్తాడు.

"సవరం ధరలు వొకలాగా ఉండనే ఉండవండి. సవరం పొడుగును బట్టి లావును బట్టి కొనేవాళ్ళ అవసరాన్ని బట్టి, ధరలు చెబుతుంటాను. ఒక్కోసారి నా కక్కుర్తికొద్దీ సగానికి సగం ధరకే అమ్ముతుంటానండి! అంతకాడికైతే తప్ప ఆ తల్లి కొనానని అంటుంది. ఏదో కాడికి అమ్ముకుంటే తప్ప - నా పొట్టగడవద్దు. ఇంకేం చావమంటారు?" అన్నాడు రాములు గుడ్లనీరు గుడ్ల కుక్కుకుంటూ.

తను కొనే వెంట్రుకల ధరలు కూడా స్థిరంగా ఉండవన్నాడు. నెలలో 16 రూపాయలు మొదలు, 40, 50, 60 రూపాయల దాకా కూడా చెల్లించి తను కొంటూ ఉంటాట్ట. వారం కిందట, పాతిక రూపాయలిచ్చికొన్న వెంట్రుకలకే, వారం తరువాత నలభై చెల్లించాల్సి వచ్చేసరికి, కడుపు తరుక్కుపోతుందంటాడు రాములు.

"నేనేమో పాత ధర ప్రకారం సవరాలిస్తానని అవతలి వాళ్ళకు మాటిస్తానండీ! అన్న తరువాత సరోసురోపడి ఆ ధరకే ఇవ్వాలిగానీ, ధరపెంచితే మాటకు మాటా పోతుంది, మనిషిమీద నమ్మకమూ పోతుంది. అందుకనే ఒక్కోసారి నష్టానిక్కూడా సరుకు అమ్మేస్తుంటాను బాబయ్యా!" అన్నాడు రాములు.

ఈ ధరలయినా తుక్కు వెంట్రుకలవేనట. దూసిన వెంట్రుకల ధర కిలో, అరవై నుండి వంద దాకా ఉంటుందిట. ఒక కిటో వెంట్రుకలతో పెద్ద పెద్ద సవరాలు అయిదుగానీ, లేకపోతే ఆరుగానీ అవుతాయన్నాడు.

ఈ పని రాములొక్కడే చేయడు. అతని భార్య పిల్లలు కూడా, అతనికి సాయపడుతూ ఉంటారు. పిల్లలేమో చిన్న చిన్న వెంట్రుకల్ని వరసబెట్టి ఇస్తారు. పాయలు సవరాలల్లేటప్పుడు ఆ జడల్లో ఈ సన్న వెంట్రుకల్ని పొదిపి సొమ్ము చేసుకుంటానన్నాడు రాములు.

"మా తాత తండ్రుల్నించి ఇదే బతుకు బాబయ్యా! మా నాయనమ్మ, మా అమ్మా రకరకాల సరుకులూ, ఊరూరూ, ఇల్లిల్లూ తిరిగి అమ్మడం, నాకు గుర్తున్నది. ఇప్పుడాపని పెద్ద పెద్దోళ్ళు షాపులు పెట్టి చేస్తున్నారు. మా పొట్ట కూడు పడిపోయింది".

ఇంకెవరన్నా వెంట్రుకల్ని దాచి ఉంచి వాటితో సవరం కట్టివ్వమన్నా రాములు కట్టిస్తూ ఉంటాడు. వెంట్రుకల్ని బట్టీ సవరాన్ని బట్టీ 4, 5 రూపాల్నుంచి 10, 12 రూపాయల దాకా కూలి తీసుకొంటానన్నాడు రాములు. సొంతంగా గానీ, ఇతరులకు గానీ రోజుకు 5, 6 సవరాల దాకా కట్టడం పెద్ద కష్టమేమీ కాదన్నాడు రాములు.

"కష్టంగానీండి, సుఖంగానీండి, చేయడానికేం అభ్యంతరం లేదు. ఒళ్ళు దాసుకోవడం నాకు చేతకాదు. కాని ఎంత విరగబడ్డా మాపటిపూటకు బువ్వకరువయితే యింకెందుకు చెప్పండి- ఈ ముదనష్టపు పని" అని విసుక్కున్నాడు రాములు.

అలాగని, అతను ఈ వృత్తిని విడిచిపెట్టలేదు. బొత్తిగా చదువు సంధ్యల్లేని రాములుకు వంశపారంపర్యంగా వస్తున్న ఈ పని తప్ప మరే వృత్తీ చేతకాదు.

"అందుకే దీన్ని బట్టుకుని వేళ్ళాడతా ఉన్నానండీ! ఉదయం 9.30 కల్లా ఇంత నోట్లేసుకొని ఊరిమీద పడతా, గొంది గొందీ, సందు సందూ తిరుగుతా. కేకలు పెడతా. ఆ పట్టుపట్టు 4-5 గంటలదాకా తిరిగీ తిరిగీ కొంపకొస్త. మళ్ళా పొద్దుపోయేదాకా సవరాలపని ఇక నా జన్మంతా ఇంతేననుకోండి!" అన్నాడు రాములు, తన అసహ్యాన్నంతా దూరంగా ఉన్న కోడి పుంజు మీదికి బెడ్డ విసరడంలో చూపుతూ. రాములు భార్య బక్కచిక్కి కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని, ఊగిసలాడుతున్నది. అతని పిల్లలు, కాళ్ళు బారజాపి, ఆ మధ్య జాగాలో వెంట్రుకల కుప్పల నుంచుకొని, హస్తార్పితంగా, వొక్కో వెంట్రుకనూ ఎడం చేతి వ్రేళ్ళ మధ్యకు చేరుస్తున్నారు. చిన్నవీ, చిదకవీ, నెరిసినవీ, చుట్టుకుపోయినవీ- గుడిసెనిండా వెంట్రుకల తుంపులే!

రాములు పిల్లల్లో ఆఖరివాడి పేరు 'నరసిమ్మ'. వాడి పొట్ట బూదరించి ముందుకు పొడుచుకొచ్చింది. గుండెమీద ఎముకలు వాతల్లాగా కనబడుతున్నాయి. మురికి లాగు జారిపోకుండా ఎర్రరంగు మొలతాడు దానిమీదికి లాక్కుని ముక్కు ఎగబీలుస్తూ మధ్య చేత్తో చీమిడిని బుగ్గమీదికి తోస్తూ రెండో అన్నకు, వెంట్రుకల్ని అందిస్తున్నాడు నరసింహం. వాడేదో అంటుంటే - తల్లి మెల్లగా గసురుకొని, వాడి నోరు మూయిస్తున్నది.

ఎన్నో వందలమంది కేశ సౌందర్యానికి పరోక్షంగా, ప్రత్యక్షంగా సాయం చేసిన రాములు, జుట్టు చిందర వందరగా, జీబురు జీబురుగా ఉన్నా సహించాడుగానీ, తన పెళ్ళాం తిరపతమ్మకు ఒక్కసవరం- కనీసం పనికిరాని వెంట్రుకలతో తయారు చేసిందాన్నాయినా సరే- ఇవ్వలేకపోయాడు పాపం!